కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఉద్యమిస్తాం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలు

బాలానగర్, నవంబర్ 6 : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఉద్యమిస్తామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని మల్లికార్జునకాలనీ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నివాస ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావచ్చిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పనైనా చేపట్టారా...? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్వమతాలకు సమన్యాయం పాటిస్తూ పండుగల సమయంలో కానుకలు అందించినట్లు తెలిపారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులకు బతుకమ్మ చీరలు అందించామని, మైనార్టీలు, క్రైస్తవుల పండుగలకు కానుకలు అందించామని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కానుకలు కనుమరుగయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం నగరంలో 144 సెక్షన్ అమలులో ఉందని... డీజేలు పెట్టవద్దు అంటున్నారని, బతుకమ్మ ఆటపాటలను ప్రభుత్వం అడ్డుకుందని విమర్శించారు. రేపటి రోజున మైనార్టీ , క్రైస్తవుల పండుగలు వస్తాయి.. వారి పండుగలకు కూడా ఇలానే వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. రూ.4వేల పింఛన్ చేస్తామన్నారు.. ఇచ్చారా..? మహిళలకు రూ.2500లు ఇచ్చారా..? రైతు బీమా, రైతు రుణమాఫీ చేశారా ....ఆరు గ్యారంటీలు తూతూమంత్రంగా అమలు చేసి రైతుల ఆశలపై నీళ్లు చల్లడం ఎంతవరకు సమంజసం అని విమర్శించారు.

కబ్జా అని తప్పుడు ఆరోపణలు..

బోయిన్ చెరువు 73 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అందులో 5 ఎకరాల స్థలంలో (50 ఏండ్ల క్రితం) గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హరిజనబస్తీ ఏర్పాటైంది. మరో 4 ఎకరాలు తిరుమలగిరి మండల పరిధిలో ఉంది. ప్రస్తుతం 63 ఎకరాల స్థలంలో చెరువు ఉంది. బోయిన్ చెరువు అభివృద్ధికి కోట్లాది నిధులు మంజూరు చేసి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాం, వాకింగ్ ట్రాక్ నిర్మించాం, వినాయకులు, బతుకమ్మలు నిమజ్జనం చేయడం కోసం కోనేరు నిర్మించామని ఎమ్మెల్యే మాధవరం తెలిపారు. నా ప్రాణమున్నంత వరకు ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ ప్రజలను కాపాడుకునే బాధ్యత తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హైడ్రా పేరుతో నిరుపేదల ఇండ్లపై కుట్రలు చేస్తూ కూల్చే ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టడం కోసం హస్మత్‌పేట హరిజన బస్తీ ప్రజలకు అండగా నిలిచి న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తీసుకువచ్చినట్లు తెలిపారు. 50 ఏండ్ల క్రితం ఏర్పడిన హరిజనబస్తీని బీఆర్ఎస్ హయాంలో ఏర్పడి నట్లుగా భావించి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేస్తామని నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వేతో పాటు కులగణన చేయడం సమగ్రంగా ఉండాలని సూచించారు. సర్వేను తప్పుల తడకగా చేస్తే సహించేదిలేదని ఆయన హెచ్చరించారు.

ప్రధానిపై ఒక్క విమర్శ అయినా చేశాడా?

రాష్ట్రాభివృద్ధికి ప్యాకేజీ ఇవ్వడం లేదని, అభివృద్ధికి సహకరించడం లేదని ప్రధాని మోదీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్క విమర్శ అయినా చేశాడా...? అని ఎమ్మెల్యే మాధవరం ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలను బీఆర్ఎస్ బొంద పెట్టడం ఖాయమని అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ బుస్సుమని బయటకు వస్తాడని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని అంటే నీకేం సంబంధం...? నీది బీజేపీనా కాంగ్రెస్ పార్టీనా అర్థం కావడం లేదన్నారు. ఇదే అంశాన్ని ప్రజలు కూడా గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ కుట్రలను ఎదురించేందుకు, ప్రజలను కాపాడుకునేందుకు ఫోర్స్ తయారు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో నేతలు నరేందర్‌గౌడ్, జంగయ్య, కుతాడి రాములు, సయ్యద్ ఎజాజ్, మక్కల నర్సింగ్, ఇర్ఫాన్, హరినాథ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

దుండిగల్, నవంబర్ 6: ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.12వేల హామీని అమలు చేయాలని సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం గాజులరామారం చౌరస్తా ఈఎస్ఐ హాస్పిటల్ దగ్గర ఏర్పాటు చేసిన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల జీవనం మరీ దుర్భరంగా మారుతుందని, రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం సందర్భంగా రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామన్న వాగ్దానం ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఇంకోపక్కన నో పార్కింగ్,సిగ్నల్ జంపింగ్ పేరుతో వేలల్లో చలాన్లు వస్తున్నాయని, నగరంలోచాలా ప్రాంతాల్లో ఆటో స్టాండ్లు రోడ్డు వెడల్పులతో పోతున్నాయని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలం అవుతున్నారని అన్నారు. ఆటో కార్మికులకు రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అంజయ్య, ఆటోయూనియన్ నాయకులు ఖలీల్, సద్దాం, వినయ్, అస్లాం, సిరాజ్, గోపాల్, సదానంద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

కుత్బుల్లాపూర్, నవంబర్ 6 : నేటి తరం విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సుచిత్ర నారాయణ పాఠశాల ఏజీఎం పురుషోత్తం, ప్రిన్సిపాల్ హేమలత అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పాఠశాలలో విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కిరణ్, దీప్తి, అంబిక, డీన్ సాయి ప్రకాశ్, ప్రతిభ,యశోద పాల్గొన్నారు

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, నవంబర్ 6: ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల సభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు బుధవారం శంభీపూర్‌లోని ఎమ్మెల్సీకార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు.

వైభవంగా పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

మాధవరం రంగారావు, గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, గుండడి రవీందర్, పురేందర్ రెడ్డి , రామచంద్రరావు పాల్గొన్నారు.

మియాపూర్ , నవంబరు 6 : వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ వీధి పెద్దమ్మ తల్లి దేవాలయ 21వ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, తదితరులు హాజరై అమ్మవారికి పూజలు చేశారు. జనంపల్లి పురేందర్‌రెడ్డి , సునీత దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తాండవ కృష్ణ, ప్రసాద్, శ్రీధర్‌రావు, సూర్యనారాయణ, చంగల్‌రెడ్డి, సుధాకర్, డాక్టర్ వంశీకుమార్, శ్రీనివాసరెడ్డి , బీఆర్ఎస్ నాయకులు

మూసాపేట సర్కిల్ డీసీకి సన్మానం

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 6 : మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.వంశీకృష్ణను బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శాలువాతో సన్మానించి... పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. సర్కిల్ పరిధిలోని పలు ప్రజా సమస్యలను డీసీతో చర్చించి... ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

ఆలయాలను అభివృద్ధి చేయడం అభినందనీయం

అయ్యప్ప సన్నిధానం, దేవతా పాకశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 6 : ఆధ్యాత్మిక చింతనతో ఆలయాలను అభివృద్ధి చేయడం అభినందనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌లోని శ్రీ సిద్ధి వినాయక భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప సన్నిధానము, దేవతా పాకశాలను స్థానిక ఎమ్మెల్యే , కార్పొరేటర్ మంద డి శ్రీనివాస్‌రావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌లో భక్తుల సౌకర్యార్థం ఆలయాన్ని అభివృద్ధి చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోదండ రామయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, అడుసుమల్లి వెంకటేశ్వర్ రావు, శ్యామ్‌చందర్(బాలు), కళ్యాణ్‌వర్మ, అప్పారావు, లింగమూర్తి, బీఆర్ఎస్ నేతలు మందలపు సాయిబాబా చౌదరి, రాజేశ్‌రాయ్, భవానీ, రమా, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నేతకు ఎమ్మెల్యే పరామర్శ

జగద్గిరిగుట్ట బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్రఅశోక్‌ను బుధవారం ఎమ్మెల్యే వివేకానంద్ పరామర్శించారు. ఆపరేషన్ చేయించుకున్న ఆయనకు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని సూచించారు. డివిజన్‌నేతలు, స్థానికులు పాల్గొన్నారు. *– జగద్గిరిగుట్ట, నవంబర్ 6*

అయ్యప్పస్వాములకు నిత్యాన్నదానం..

అల్లాపూర్ డివిజన్, శ్రీవివేకానందనగర్‌లోని శ్రీప్రన్నాంజనేయ దేవాలయ ప్రాంగణంలోని వేదశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పమాలధారణ స్వాములకు నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగుతున్నది. ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి అన్నప్రసాద వితరణ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు రోజిక జన్నాథం తెలిపారు. ఈ అవకాశాన్ని అయ్యప్ప స్వాములు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
– అల్లాపూర్, నవంబర్ 6

ఘనంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల ల్యాండ్‌మార్క్ ఈవెంట్

దేశ వ్యాప్తంగా శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు సాధించిన సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డ్ ఘనత విద్యారంగ చరిత్రలో అద్భుత ఘట్టమని శ్రీ చైతన్య స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ సీమ అన్నారు. మియాపూర్‌లోని శ్రీ చైతన్య స్కూల్ పాఠశాల విద్యార్థులు సూపర్ హ్యాట్రిక్ రికార్డ్‌ను సాధించిన నేపథ్యంలో బుధవారం ల్యాండ్ మార్క్ ఈవెంట్‌ను నిర్వహించారు. దీనిని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ ...దేశ వ్యాప్తంగా శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు సాధించిన ఘనతను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో 20 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, తదితరులు ఉన్నారు.
–మాదాపూర్, నవంబర్ 6

రక్తదానం శిబిరం

మాదాపూర్, నవంబర్ 6: మియాపూర్ చైతన్య విద్యాసంస్థల చైర్ పర్సన్, డాక్టర్ రూన్సీ లక్ష్మీ బాయి జన్మదినాన్ని పురస్కరించుకొని చైతన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, దుర్గాబాయి దేశ్ ముఖ్ బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ హాజరై రక్తదాన శిబిరంలో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ నాగేందర్ యాదవ్, జీఎం రవికుమార్, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, డీన్ సురేందర్, శంకర్‌రావు, శ్రీనివాసరావు, ఏజీఎం రాంబాబు, హరి, మాదవ్, చంటి పాల్గొన్నారు.

గిరిజన, బంజారాల సంస్కృతికి ముత్యాలమ్మ పండుగ అద్దం పడుతుందని బీఆర్ఎస్‌నేత శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్‌తండా-2లో బుధవారం జరిగిన ఆలయ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో రవీందర్‌నాయక్, అమర్‌సింగ్, హన్మంత్‌నాయక్, శివ, ప్రవీణ్, కుమార్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు. *– దుండిగల్, నవంబర్ 6*

సమస్యల పరిష్కారానికి కృషి

అల్లాపూర్, నవంబర్6: స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ సబీహాబేగం అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్‌లో పర్యటించిన ఆమె.. మంజీర మంచినీటి పైపులైన్ లీకేజీ కావడంతో దానిని పరిశీలించారు. వెంటనే ఆమె.. జలమండలి అధికారులకు సమాచారం అందించి సత్వరమే సమస్యను పరిక్షించాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ హమీద్, మామా, షఫీ, మస్తాన్, శ్యామ ఉన్నారు.

బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు అంకురార్పణ

బాలానగర్, నవంబర్ 6 : బాలానగర్ చిత్తారమ్మబస్తీ డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయంలో భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు పనులకు అంకురార్పణ జరిగింది. బుధవారం చిత్తారమ్మ బస్తీ డబుల్ బెడ్‌రూం రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జాతీయ దళిత శ్రీశక్తి కన్వీనర్, హైకోర్టు అడ్వకేట్ గడ్డం జాన్సీ హాజరై ఆయా పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బీఆర్ అంబేద్కర్ అన్ని కుల, వర్గ, మతాలకు భారత రాజ్యాంగంలో సమన్యాయం చేశారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను అన్ని వర్గాలు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు శాకయ్య, సామ్యేల్, విజయభాస్కర్, అంజన్న, స్వరూప, లక్ష్మి, అరుణ, సరోజ, రాధ, అనురాధ, రుక్మిణి పాల్గొన్నారు.

దాడులపై నిరసన

దుండిగల్, నవంబర్ 6 : మంది రాలపై జరిగే దాడులకు వ్యతిరేకంగా హిందువులంతా ఏకం కావాలని నిజాంపేట బీజేపీ అధ్యక్షుడు భిక్షపతి యాదవ్ కోరారు. ఇటీవల జరిగిన దాడుల ఘటనలను వ్యతిరేకిస్తూ బుధవారం నిరసనకు దిగారు. సందర్భంగా ర్యాలీ తీసి ప్రజలంతా ఐక్యతతో ఉండాలని కోరారు. సనాతనధర్మానికి వ్యతిరేకంగా కుట్రలు చేసేవారిని ప్రజలు క్షమించరని తెలిపారు. నరేంద్రచౌదరి, ప్రసాద్‌రాజు, శ్రీనివాస్‌గుప్తా, సచిన్, బాబుచౌదరి, నర్సింహారెడ్డి, అప్పలరాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా..సమగ్ర కుటుంబ సర్వే

ఇంటింటికి తిరిగి వివరాల సేకరణ.. సర్వే సిబ్బందికి సహకరించాలి : అధికారులు, ఎమ్మెల్యే



శేరిలింగంపల్లి సర్కిల్, రాయదుర్గం ప్రశాంతిహిల్స్ కాలనీలో ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు ఇంట్లో సర్వేవివరాలు సేకరించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ ఉపేందర్ రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 6 : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించేలా , ప్రతి ఇంటికి వెళ్లి పక్కాగా వివరాలను సేకరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు బి.వంశీకృష్ణ, కృష్ణయ్యలు తెలిపారు. బుధవారం కేపీహెచ్‌బీ కాలనీలో సమగ్ర కుటుంబ సర్వేను డీసీ వంశీకృష్ణ పరిశీలించగా, వివేకానందనగర్, కూకట్‌పల్లి డివిజన్‌లలో డీసీ కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని ప్రతి ఇంటిలో సర్వే చేసేందుకు గాను అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఒక కుటుంబానికి చెందిన సర్వేలో 8 పేజీలతో కూడిన 75 ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకుని, ఆ వివరాలను సర్వే ఫారంలో పక్కగా నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఒక్కో సర్వే పూర్తిచేసేందుకు ఎన్యుమరేటర్‌కు సుమారుగా 40 నిమిషాలు పడుతుందని, వారికి అప్పగించిన ఏరియాలో 20 రోజుల్లో సర్వే పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. కాలనీలు, బస్తీలలో నివసిస్తున్న ప్రజలందరూ.. సర్వే చేయడానికి వచ్చిన అధికారులు, సిబ్బందికి సహకరించాలని వారు కోరారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో ..

శేరిలింగంపల్లి: ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో బుధవారం ప్రారంభమైంది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, తదితర అంశాలతో కూడిన వివరాలను సేకరిస్తున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి, కొండాపూర్, శేరిలింగంపల్లి వార్డుల వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇన్‌చార్జిలు ఈ సర్వే ప్రక్రియను ప్రారంభించి పర్యవేక్షిస్తున్నారు. గచ్చిబౌలి డివిజన్, రాయదుర్గం ప్రశాంతిహిల్స్ కాలనీలో ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు ఇంటికి సిబ్బందితో కలిసి వెళ్లిన జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి సమగ్ర కుటుంబసర్వే వివరాలు సేకరించి సర్వేచేసినట్లు ధ్రువీకరించే స్టిక్కర్‌ను ఇంటి గోడకు అతికించారు.

దుండిగల్, నిజాంపేట పరిధిల్లో..

దుండిగల్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్(ఎన్ఎంసీ) మేయర్ కొలన్ నీలాగోపాల్ రెడ్డి కోరారు. కార్పొరేషన్ పరిధి,12వ డివిజన్‌లో బుధవారం మేయర్, కమిషనర్ సాబేర్ అలీ, ఎన్ఎంసీ ఆయా విభాగాల అధికారులతో కలిసి సర్వే ప్రారంభించారు.

- దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, 25వ వార్డు మల్లంపేట్ ప్రణీత్ ప్రణవ్ లీఫ్‌లో సమగ్ర సర్వేను కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత శంభీపూర్‌కృష్ణ, దుండిగల్ పురపాలక చైర్‌పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి , కమిషనర్ సత్యనారాయణలు ప్రారంభించారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ బాలక్రిష్ణ, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చందానగర్ సర్కిల్‌లో..

మియాపూర్ : చందానగర్ సర్కిల్ వ్యాప్తంగా సర్వే బుధవారం ప్రారంభమైంది. సర్కిల్ పరిధిలోని నాలుగు సర్కిళ్లలో ఎన్యుమరేటర్లు తొలుత ఇండ్లకు స్టిక్కర్లను అతికించే ప్రక్రియను నిర్వహించారు. తదుపరి నివాసాల వద్ద ప్రొఫార్మాలో వివరాలను నమోదు చేశారు. సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి పలు ప్రాంతాల్లో పర్యటించి స్టిక్కర్లు, సర్వే తీరును పరిశీలించారు. అలాగే.. వివేకానందనగర్ , హైదర్‌నగర్ డివిజన్‌లలో కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి, నార్నె శ్రీనివాస్‌రావులు సిబ్బందితో కలిసి సర్వేలో పాల్గొని వివరాల నమోదును పరిశీలించారు.

- సమగ్ర సర్వేలో భాగంగా వివేకానందనగర్ డివిజన్, సప్తగిరి కాలనీలో పీఏసీ చైర్మన్ గాంధీ నివాసంలో కూకట్‌పల్లి డీసీ కృష్ణయ్య సహా ఇతర అధికారులు తొలుత స్టిక్కర్‌ను అతికించి వివరాలను నమోదు చేశారు.

చందానగర్‌లో సర్వేను ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజులారెడ్డి, డీసీ మోహన్‌రెడ్డి

హైదర్‌నగర్ డివిజన్‌లో..

- కొండాపూర్ : బడుగు, బలహీన, వెనకబడిన తరగతుల కులాల జాబితను సమగ్ర కుల గణన ద్వారా సిద్ధం చేసి అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను బుధవారం చందానగర్ సర్కిల్ -21 పరిధిలోని చందానగర్‌లో డిప్యూటీ కమిషనర్ మోహన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉషారాణి, నాయకులు రఘునాథరెడ్డి, ప్రసాద్, అక్బర్‌ఖాన్, ఎల్లమయ్య, బాలక్రిష్ణ చౌదరి, సందీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమగ్రసర్వేలో దుండిగల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సుంకరి క్రిష్ణవేణికృష్ణ, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

కేపీహెచ్‌బీ కాలనీలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న డీసీ వంశీకృష్ణ

సర్వే ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న నిజాంపేట మేయర్ నీలాగోపాల్‌రెడ్డి

కారు వాష్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

కొండాపూర్, నవంబర్ 6 : షార్ట్ సర్క్యూట్‌తో కారు వాష్ సెంటర్ దగ్గమైన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. నిర్వాహకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... దూభే కాలనీ సమీపంలోని ఎక్స్‌ప్రెష్ కారు వాష్ సెంటర్‌లో బుధవారం తెల్లవారు జామున లిఫ్ట్‌లో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. రెండు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టిన కారు

మాదాపూర్, నవంబర్ 6: అతివేగంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్ వివరాల ప్రకారం ... బుధవారం తెల్లవారు జామున 5:40 గంటల సమయంలో బొలెరో కారు డ్రైవర్ హైటెక్ సిటీ నుంచి జూబ్లీ హిల్స్ వరకు నిర్లక్ష్యంతో అతి వేగంగా వెళ్తూ.. అదుపుతప్పి పిల్లర్ నంబర్ సీ 1719, పీ 1720 మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టాడు. దీంతో డివైడర్ గోడపగిలి కేబుల్స్ ధ్వంసమయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు దర్యాప్తు జరిపి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అతని పేరు నరసింహ అని తెలిసింది.

ముగ్గురు పిల్లలు సహా తల్లి అదృశ్యం

బాలానగర్, నవంబర్ 6 : భర్తతో గొడవపడి పిల్లలను తీసుకొని తల్లి అదృశ్యమైంది. బాలానగర్ సీఐ నర్సింహరాజు వివరాల ప్రకారం..నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన నాగపురి రాజు ..చింతల్ పద్మానగర్ ఫేజ్‌లో నివాసముంటూ వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు.